సాక్షి
తిరుపతి
శనివారం । 9 । మార్చి । 2024



మహిళా పక్షపాతి సీఎం జగన్

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని ఎంపీ గురుమూర్తి, సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్త కొనియాడారు. - 8లో



సిద్ధేశ్వరునికి పట్టువస్త్రాలు..

తలకోన సిద్ధేశ్వరునికి స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లి పట్టు వస్త్రాలు సమర్పించారు. - 8లో



స్విమ్మింగ్‌పూల్ పునఃప్రారంభం

తిరుపతిలో ఈనెల 11న స్విమ్మింగ్ ఫూల్‌ను పునఃప్రారంభించనున్నట్టు కలెక్టర్ జీ.లక్ష్మీశ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

రీజినల్ కో–ఆర్డినేటర్‌గా మంత్రి పెద్దిరెడ్డి



తిరుపతి అర్బన్: అనంతపురం, హిందూపురం, చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్‌గా పంచాయతీ, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియమించారు. ఈమేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆయన నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల విజయానికి కృషి చేయనున్నారు. ఆ మేరకు ఆయన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తల తోపాటు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయనున్నారు.

నిరుద్యోగులకు శిక్షణ



పనులు పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధిహామీలో వంద రోజులు పని పూర్తిచేసిన కుటుంబాల్లోని నిరుద్యోగులకు ఉన్నతి ద్వారా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పిస్తున్నట్టు డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మర్రిమందలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. కూలీల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వంద రోజులు పూర్తిచేసిన కటుంబాల్లో 18 నుంచి 40 ఏళ్లలోపు నిరుద్యోగులను గుర్తించి వారికి దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా 90 రోజులు ఉచిత శిక్షణ ఇస్తారని వివరించారు. శిక్షణానంతరం వారికి ఉద్యోగ కల్పన జరుగుతుందన్నారు. ఏపీవో దేవరి, సీడీసీఎల్ఆర్సీ చంద్రశేఖర్ రాజు, క్షేత్ర సహాయకులు కేశవులమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేసుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి తుడా: రుయాలో శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి వైద్య నిపుణుడు డాక్టర్ చలపతి రెడ్డి కలెక్టర్‌కి కంటి పరీక్షలు చేశారు. అంతకుముందు ఆయన రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు పాల్గొన్నారు.



హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ భక్తులు తన్మయత్వంలో మునిగితేలారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వయంభూగా వర్ధిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరుని దర్శించి తరించారు. లింగోద్భావం సందర్భంగా శివయ్య నిజరూప దర్శనానికి జనం పోటెత్తారు. జనజాగరణ చేసి.. జంగమయ్యను దర్శించి పునీతమయ్యారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. శివయ్య భక్తులకు శీఘ్రదర్శనానికి ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు.



అలంకార మండపంనుంచి పురవీధుల్లోకి వేంచేస్తున్న ఉత్సవ మూర్తులు

శంభో.. స్వయంభో

- వైభవంగా **మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు**
- శ్రీకాళహస్తీశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు
- కనీవిని ఎరుగని రీతిలో భారీ ఏర్పాట్లు
- అర్ధరాత్రి దాటాక జంగమయ్య లింగోద్భవ దర్శనం
- ఆకట్టుకున్న కళారూపాలు



నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న శివపార్వతులు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. వాయులింగేశ్వరుడి నిజరూపాన్ని దర్శించేందుకు భక్తలోకం తరలివచ్చింది. శుక్రవారం వేకువ జామున 2 గంటలకే ఆలయ అర్చకులు పవిత్ర మంత్రోచ్చారణలు చేస్తూ స్వామి, అమ్మవార్లను పల్లియరతో మేల్కొల్పారు. అనంతరం గోపూజ నిర్వహించారు. సుప్రభాత సేవ తరువాత స్వామి, అమ్మవార్ల సర్వదర్శనానికి 3 గంటలకు అనుమతించారు. ఉదయం 5 నుంచి 10.30 గంటల మధ్య విశేష అభిషేకాలు నిర్వహించారు.

నేడు రథోత్సవం, తెప్పోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 11గంటలకు రథోత్సవం ప్రారంభం కానుంది. ఒక రథంపై శ్రీకాళహస్తీశ్వరస్వామి, మరో రథంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు ఊరేగనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

నంది వాహనంపై నీలకంఠుడి వైభోగం

మహాశివరాత్రి పర్వదినం రోజైన శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వర స్వామివారు నంది వాహ నంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణాభరణాలతో స్వామివారి దేవేరి జ్ఞానప్రసూనాంబిక పరాక్రమాలకు ప్రతీక అయిన సింహ వాహనంపై విహరిస్తూ కనువిందు చేశారు. తిరుమల వెంకన్న బ్రహ్మోత్సవాల్లో గరుడ సేవకు ఎంత విశిష్ట ఉందో శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నంది సేవకు అంత ప్రాముఖ్యత ఉంది. అందుకు కారణం లేకపోలేదు. ధర్మానికి ప్రతీకలైన నంది పాదాలు కావడం ఒక విశేషం. అలాగే శ్రీకాళహస్తీశ్వరుని నమ్మిన భంటుగా నంది ఉండడం మరో కారణం. నంది అనుమతితో స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరు తాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల్లో స్వామివారు నంది వాహనంపై ఊరేగుతున్న నీలకంఠుడిని భక్తజనం దర్శించి తరించారు. అలాగే అమ్మవారు సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. సింహ, నంది వాహనాలు స్వరూపరీత్యా వైరుధ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ బ్రహ్మోత్సవాల్లో ముఖ్యంగా మహాశివరాత్రి పర్వదినంలో ఈ రెండు వాహనాలు స్వామి, అమ్మవార్లతో కలిసి పుర ప్రదర్శనకు రావడం విశేషం. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



సాంస్కృతిక నీరాజనం







సిద్ధమైన రథం

ఇంద్ర విమానంపై చిద్విలాసం



ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరుడు ఇంద్ర విమానంపై పుర వీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. స్వామి వారి దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారు చప్పరంపై ఆసీనులై స్వామివారిని అనుసరించారు. మూషిక వాహనంపై వినాయకుడు, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప చప్పరాలపై ఊరేగుతూ ముందుకు సాగారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు.

లింగోద్భవ దర్శనానికి ఏర్పాట్లు పూర్తి

లింగోద్భవ దర్శనానికి ఎలాంటి ప్రత్యేక ప్రవేశ రుసుం నిర్ణయించకుండా సామాన్య భక్తులు కూడా దివ్యదర్శనం చేసుకునే విధంగా ఉచిత మహాలఘు దర్శనాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి నంది సేవ అనంతరం 11వ కాలాభిషేకాన్ని లింగోద్భవ అభిషేకంగా పేర్కొంటారు. ఈ అభిషేకం కోసం అత్యధిక సంఖ్యలో భక్తులు రాత్రంతా జాగరణ చేసి స్వామి వారి నిజరూప లింగోద్భవ దర్శనం చూడడానికి వేచి ఉంటారు. దీని కోసం ఆలయం తరఫున నాలుగు కూడళ్లలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేసి భక్తిరస చిత్రాలను ప్రదర్శించారు.



వాహన సేవలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుటుంబం

భారీ ఏర్పాట్లు



లక్ష మంది భక్తులు వచ్చినా ఎలాంటి ఆటంకం లేకుండా దర్శనం చేసుకునే విధంగా భిక్షాల గోపురం నుంచి సామాన్య భక్తులకు ఉచిత దర్శనం, రూ.50, రూ.200 ప్రవేశ దర్శనాలకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. 3వ ద్వారం నుంచి ముందు రోజు రూ.200 తీసుకున్న స్థానిక భక్తులకు, వీఐపీ, వీవీఐపీలను దక్షిణ గోపురం నుంచి దర్శనానికి అనుమతించారు. వచ్చిన ప్రతి భక్తునికీ లడ్డూ ప్రసాదాన్ని వితరణగా ఇచ్చారు. ఏపీ టూరిజం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఒకేచోట బస చేసే విధంగా తిరుమల తరహాలో షెడ్లను ఏర్పాటు చేశారు. దూర్జటి కళాప్రాంగణాన్ని గాలిగోపురం వెనుకకు మార్చి ట్రాఫిక్ సమస్యను నియంత్రించారు. సుమారు 100 మరుగుదొడ్లు, స్నానపు గదులను ప్రత్యేకంగా నిర్మించారు. గంగా సదన్, కైలాస సదన్ విడిది గృహాలను భక్తుల బస కోసం కేటాయించారు. మార్కెట్ యార్డ్, ఏపీ సీడ్స్, స్వర్ణముఖినది కరకట్ట, చెన్నై నుంచి వచ్చే వారి కోసం డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయంలో నాలుగు టన్నుల పండ్లు, 10 టన్నుల పూలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయం లోపల 20 ప్రాంతాల్లో జలప్రసాదాన్ని పంపిణీ చేశారు.

భక్తుల సేవకుడిని నేను

ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉదయం నాలుగు గంటలకే ఆలయానికి చేరుకుని భక్తుల సేవలో తరించారు. స్వామివారి ఆలయం వద్ద వారికి పండ్లు, రుద్రాక్షాలను ప్రసాదంగా అందించారు. క్యూల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. కుటుంబ సమేతంగా ఆలయంలో స్వామి ,అమ్మవార్ల ఊరేగింపులో పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సుపరిపాలనను ఆశీర్వదించండి

- ప్రజలే మా బ్రాండ్ అంబాసిడర్లు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- జెడ్పీ గెస్ట్‌హౌస్ ప్రారంభం
- 1,200 మంది మహిళలకు భూ పంపిణీ



భూ పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప

పుంగనూరు : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలో నూతనంగా నిర్మించిన జెడ్పీ అతిథిగృహాన్ని ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్పతో కలిసి ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గంలోని 1,200 మంది మహిళలకు 1,130 ఎకరాలకు సంబంధించి పట్టాలు పంపిణీ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ప్రజలకే స్టార్ క్యాంపెయినర్లు, బ్రాండ్ అంబాసిడర్లను తెలిపారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ఐదేళ్లలో పుంగనూరు నియోజకవర్గం అద్భుతంగా అభివృద్ధి చెందిందని వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని స్పష్టం చేశారు. ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.వేల కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అన్ని గ్రామాల్లో 20 వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించామన్నారు. సిమెంటు రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ప్రాంతంలో రెండు రిజర్వాయర్లను నిర్మిస్తుంటే చంద్రబాబు అడ్డుకున్నారని మండిపడ్డారు. దీనిపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, తీర్పురాగానే ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి సాగు, తాగు నీరు అందిస్తామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీపై ఆర్థిక భారం తప్పించేందుకు సుమారు రూ.6 కోట్లతో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నీరు విడుదల చేసినట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో సైతం హంద్రీ–నీవా ద్వారా అన్ని చెరువులను నింపుతున్నట్లు తెలిపారు. కర్నూలు, అనంతపురం, మదనపల్లె, పుంగనూరు వరకు హంద్రీ–నీవా కాలువ విస్తరణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నా ఎల్లోమీడియాకు అభివృద్ధి కనపడదని, చిన్న సమస్యను భూతద్దంలో చూపించి ప్రజలను మోసపుచ్చేందుకే యత్నిస్తుందని ఆరోపించారు. పుంగనూరులో జర్మనీకి చెందిన పెప్పర్ మోషన్ ఎలక్ట్రికల్ బస్సుల కంపెనీ నెలకొల్పడంతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి విశేష కృషి చేశారని ప్రశంసించారు. ఫ్యాక్టరీ కోసం 800 ఎకరాలను సేకరించి నిర్వాసిత రైతులకు తగిన పరిహారం అందించే పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రెండేళ్లలో పరిశ్రమ నిర్మాణ పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి పాల్గొన్నారు.

40 ఏళ్ల సమస్యకు పరిష్కారం



అమ్మవారిపట్టెడకు రోడ్డును ప్రారంభిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: మండలంలోని అత్తూరు పంచాయతీ అమ్మవారిపట్టెడ గ్రామానికి 40ఏళ్లగా రోడ్డు లేకపోవడంతో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన రోడ్డును శుక్రవారం మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి ప్రారంభించారు. రూ.25 లక్షతో అత్తూరు నుంచి అమ్మవారిపట్టెడకు రోడ్డు నిర్మించారు. 2019 ఎన్నికల ప్రచారంలో తాము ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి రోడ్డు సమస్యను విన్నవించుకోగా, ఆయన గుర్తుంచుకుని నిధులు కేటాయించి రోడ్డు నిర్మాణం పూర్తి చేశారని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్, మాజీ సర్పంచ్ హరినాథ్ యాదవ్, సునీల్‌యాదవ్, చిట్టియాదవ్, వెంకటముని, సతీష్, లక్ష్మీపతి, సురేష్, శ్రీరాములు, ప్రేమ్‌కుమార్, మల్లికార్జున, అనిల్, మునిసుబ్బులు, ముని జగదీష్, లోకేష్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 57,880 మంది స్వామివారిని దర్శించుకోగా 19,772 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.15 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం



నూతన పాలకమండలితో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ నూతన పాలకమండలి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. గత పాలకమండలిలో ఉన్న మున్నారాయల్ స్థానంలో కృష్ణకుమార్, ప్రత్యేక ఆహ్వానిదుతు మోహన్‌రెడ్డి స్థానంలో కంఠా ఉదయ్‌ని, అదనంగా లీలావతి, చిన్న సుబ్బారెడ్డి స్థానంలో రాముగుప్తాను నియమించారు. చైర్మన్‌గా అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులుగా జల్లికృష్ణయ్య, జయశ్యామ్, ప్రకాశం పంతులు, పసల సుమతి, జయమ్మ, లక్ష్మీ రమాప్రభ, చెంచులత, కొండూరు సునీత, భారతి, పెదిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, సుబ్బరామగుప్తా, అవలపాటి శ్రీనివాసులు, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా శ్రీకాళహస్తీశ్వరాలయ గురుకుల్‌ను నియమించారు. వారిని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.

లెఫ్టినెంట్ గవర్నర్‌కు సాదర స్వాగతం


రేణిగుంట విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న కలెక్టర్ లక్ష్మీశ

రేణిగుంట: తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘనస్వాగతం లభించింది. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో కలెక్టర్ జీ.లక్ష్మీశ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకుని తిరుమలకు బయల్దేరి వెళ్లారు. శనివారం తిరుమల శ్రీవారి దర్శనానంతరం తిరుగుపయనం కానున్నారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో ప్రోటోకాల్ ఎస్‌డీసీ భాస్కర్‌నాయుడు, లైజన్ అధికారి లోకనాథం తదితరులు ఉన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


బ్రహ్మోత్సవాల అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు

శ్రీకాళహస్తి : టీటీడీ అనుబంధంగా శ్రీకాళహస్తి మండలం, తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. ఆలయ అర్చక స్వాములు కలశపూజ నిర్వహించి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీపళ్లికొండేశ్వర స్వామి వారికి టీటీడీ పట్టువస్త్రాలు


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ సిబ్బంది

తిరుమల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రమైన సురుటుపల్లిలోని శ్రీపళ్లికొండేశ్వర స్వామివారికి టీటీడీ తరఫున శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీవారి ఆలయ పారుపత్తేదారు ఉమామహేశ్వర్‌రెడ్డి, వేదపారాయణదారులు పట్టువస్త్రాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మహాశివరాత్రి సందర్భంగా ఈ ఆలయానికి టీటీడీ తరఫున పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ బాలాజీరెడ్డి, ఈవో శరవణ పాల్గొన్నారు.

సిద్ధేశ్వరునికి పట్టువస్త్రాల సమర్పణ


శ్రీసిద్ధేశ్వరి అమ్మవారు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు, పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తలకోన(భాకరాపేట): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీసిద్దేశ్వరి సమేత శ్రీసిద్దేశ్వరస్వామి వారికి స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, ఈఓ జయకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివునికి సేవ చేయడం చాలా గొప్పకార్యక్రమమన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మహాదేవున్ని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రావారిపాళెం ఎంపీపీ రెడ్డెమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చెంగల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కరుణాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తలకోనకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారు జామున శ్రీసిద్దేశ్వరి సమేత శ్రీసిద్దేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం రుద్రహోమం, సుదర్శన హోమం, మన్యుసూక్త హోమం, లఘు పూర్ణాహుతి, హారతి, తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది. తలకోనలోని పుణ్యతీర్థం అయిన (శిరోద్రోణం) ఝరిలో స్నానాలు ఆచరించి తలకోన సిద్దేశ్వరి సమేత శ్రీ సిద్దేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తలనీలాలు సమర్పించారు. రాత్రి జాగారం, స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు.

అన్నింటా మనమే


అవార్డులు అందుకున్న అధ్యాపకులతో వర్సిటీ వీసీ భారతి, అతిథులు

- మహిళాభివృద్ధితోనే దేశం పురోభివృద్ధి
- మహిళా దినోత్సవంలో వక్తల పిలుపు
- మహిళా వర్సిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

తిరుపతి సిటీ: ఆధునిక సాంకేతిక యుగంలో అన్ని రంగాలలో మహిళలు దూసుకుపోతూ అన్నింటా మనమేనని నిరూపిస్తున్నారని మహిళా వర్సిటీ వీసీ డీ.భారతి కొనియాడారు. శుక్రవారం పద్మావతి మహిళా వర్సిటీ ఉమెన్ స్టడీస్, అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ మాట్లాడుతూ, మహిళలపై పెట్టుబడి పెట్టడం అనేది ప్రపంచ భవిష్యత్‌పై పెట్టుబడివంటిదన్నారు. మహిళా దినోత్సవం ప్రారంభించి వంద ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ మహిళలు లింగ వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లింగసమానత్వం, మహిళా సాధికారత ధ్యేయంగా వర్సిటీ పనిచేస్తోందని చెప్పారు. అమర హాస్పిటల్ ఎండీ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ కీలకోపన్యాసం చేస్తూ, మహిళలు అవమానాలు, కట్టుబాట్లుకు తలొగ్గితే జీవితం శూన్యమన్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ ప్రశ్నించేతత్వం కలిగి ఉండాలన్నారు.

మహిళలకు మాత్రమే ప్రత్యేకంగా జాబ్‌మేళా

గౌరవ అతిథిగా ఆటా ఇండియా కో–ఆర్డినేటర్ సూర్యచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశానికి బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర ఎనలేనిదన్నారు. కుటుంబం మొదలు దేశాభివృద్ధి వరకు ఆమె పలు పాత్రలు పోషిస్తోందన్నారు. మహిళలకు మాత్రమే ప్రత్యేకంగా ఇక్కడ జాబ్‌మేళా నిర్వహించేందుకు పూనుకుంటామని, దీనిపై వర్సిటీ అధికారులు కసరత్తు చేయాలని సూచించారు.

మాతృ.. ఆచార్య..అతిథిదేవోభవలో మనమే టాప్..!

ప్రముఖ సామాజిక వేత్త శ్రీలక్ష్మీరెడ్డి ప్రధానవక్తగా తన ప్రసంగంతో విద్యార్థినులను ఉర్రూతలూగించారు. మహిళల త్యాగాలే కుటుంబ అభివృద్ధికి మూలాలని చెప్పారు. 'మాతృదేవోభవ..పితృదేవోభవ..ఆచార్యదేవోభవ..అతిథిదేవోభవ'లో పితృదేవోభవ మినహా మిగిలిన మూడింటా కూడా మహిళలదే సాధికారత అని తనదైన శైలిలో విశ్లేషిస్తూ నవ్వులు పూయించారు. చదువొక్కటే ఆయుధం కాదు..సవాళ్లను కూడా ఎదుర్కొనే ధైర్యం కూడా ఉండాలని తన జీవితంతో ఎదురైన ఆటుపోట్లు, చదువునే వయసు నుంచి వివాహమైన తర్వాత కూడా చేసిన త్యాగాల గురించి విద్యార్థినులకు స్ఫూర్తిదాయకంగా చెప్పారు. తాను చదువుకునే రోజుల్లో టెస్ట్‌లో టాపర్ అని, పైచదువులు చదవాలనే ఆకాంక్ష బలీయంగా ఉన్నా వివాహం చేయడంతో తన కలలు కల్లలయ్యాయని, ఆ కసితో అనుక్షణం రగిలిపోతూ తన కుమార్తెల్లో ఒకరిని ఐఏఎస్ (రోహిణి సింధూరి), మరొకరి డెర్మటాలజిస్టును చేశానని, తనకు కార్పొరేటర్, ఎమ్మెల్యే సీటు ఆఫర్ వచ్చినా తిరస్కరించానని, అలాగే తాను పీహెచ్‌డీ, ఇటీవల బీఎడ్ కూడా పూర్తి చేశానని, చివరి శ్వాస వరకు చదువుతూనే ఉంటాననడంతో సెమినార్ హాల్ కరతాళధ్వనులతో మార్మోగింది. మహిళలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని, తనను సంప్రదించవచ్చని ఆమె ప్రకటించారు. అనంతరం వర్సిటీ అభివృద్ధికి కృషి చేసిన ప్రొఫెసర్ జ్యోతి, ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఉమామహేశ్వరిని ప్రత్యేక అవార్డులతో అధికారులు సత్కరించారు. వారితో పాటు వర్సిటీలోని 22 మంది అధ్యాపకులను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే జర్నల్స్‌ను ఆవిష్కరించారు. డీన్ అనురాధ, డాక్టర్ నీరజ, ప్రొఫెసర్లు సీతాకుమారి, కాత్యాయిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళాపక్షపాతి సీఎం జగన్


మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ మద్దిల గురుమూర్తి, నూకతోటిరాజేష్


సమావేశానికి హాజరైన మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగానే వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ రుణాలతో పాటు, వైఎస్సార్ బీమా పథకాలను ప్రవేశపెట్టారని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని మార్కెట్ యార్డులో ఆయన వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలిసి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు వైఎస్సార్ ఆసరా డిజిటల్ చెక్కును పంపిణీ చేశారు. మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళల పక్షపాతి అని కొనియాడారు. మహిళాభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్టు వెల్లడించారు. మండలంలో 729 గ్రూపులకు వైఎస్సార్ ఆసరా పథకంలో 6 కోట్ల 61 లక్షల 65 వేల 901 రూపాయల చెక్కును అందించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలకు వైఎస్సార్ ఆసరాతో పాటు సున్నా వడ్డీ రుణాలు, బీమాను అందజేస్తున్నట్టు తెలిపారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరనాథరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉగ్గుమూడి సంధ్య, సత్యవేడు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనరు వేలూరురాకేష్, ఎంపీపీ సుబ్బులక్ష్మి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, మణినాయుడు, ఉగ్గుమూడి గురునాథం, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, గురవయ్య, భాస్కర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, రాజా, కో ఆప్షన్ మెంబరు ఇమామ్‌బాషా, ఏపీఎం ఇందిరమ్మ, పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు ప్రభుత్వాలు ప్రాధాన్యం

- ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలీ
- మల్టీ పర్పస్ హాల్, బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం


మల్టీ పర్పస్ హాల్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలీ మధుస్మిత

తిరుపతి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారికతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఆదాయపు పన్నుశాఖ ఏపీ, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలీ మధుస్మిత అన్నారు. తిరుపతి ఆదాయపు పన్నుశాఖ ప్రధాన కార్యాలయంలో నూతన మల్టీ పర్పస్ హాల్‌ను ఆమె, బ్యాడ్మింటన్ కోర్టును ఆదాయపు పన్నుశాఖ తిరుపతి, హైదరాబాద్ కమిషనరేట్ల చీఫ్ కమిషనర్ నరసమ్మ శుక్రవారం ప్రారంభించారు. సరదాగా చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఉద్యోగినులతో కలిసి ఫొటోలకు దిగారు. మిథాలీ మధుస్మిత మాట్లాడుతూ ఆర్థిక భరోసాతో మహిళా సాధికారిత సాధ్యమని, ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషి చేస్తున్నట్లు చెప్పారు. పన్ను చెల్లింపుదారుల హక్కులను కాపాడడంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నరసమ్మ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపు పన్నుశాఖ కీలక అధికారులు మహిళాలు కావడం ప్రత్యేకమని తెలిపారు. ఈనెల 15వ తేదీ లోపు పన్ను చెల్లింపుదారులు అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాలని కోరారు. ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ వంశీధర్, అడిషనల్ కమిషనర్ శోభ, అసిస్టెంట్ కమిషనర్ దయానంద్ ప్రసాద్, అధికారి(ప్రోటోకాల్) వెంకటబాలాజీ పాల్గొన్నారు.

11న స్విమ్మింగ్ పూల్ పునఃప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ఈ నెల 11నుంచి పునఃప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. స్విమ్మింగ్ పూల్‌ను జనవరి నెలలో మరమ్మతులు, శుద్ధి కారణంగా మూసివేశారు. ఈ నేపథ్యంలో స్విమ్మింగ్ పూల్‌ను శుక్రవారం కలెక్టర్ పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుంచి పునఃప్రాంభించనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు, స్విమ్మర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏఓ సయ్యద్ సాహెబ్, స్విమ్మింగ్ కోచ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు మహిళలకు, 7 నుంచి 9గంటల వరకు పురుషులు, స్విమ్మర్లకు, సాయంత్రం 4నుంచి 8 గంటల వరకు పురుషులు, స్విమ్మర్లకు స్విమ్మింగ్ పూల్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నేను చనిపోతున్నా..!

- కలకలం రేపిన యువకుడి సెల్ఫీ వీడియో
- మానసిక స్థితి సరిగాలేకనేనన్న తల్లిదండ్రులు


నిరంజన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న వెంకటగిరి ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం): 'నేను చనిపోతున్నా..' అంటూ వెంకటగిరి సమీపంలోని కోనమల్లేశ్వరస్వామి అడవుల్లో ఓ యువకుడి సెల్ఫీ వీడియో ఒకటి వెంకటగిరిలో కలకలం రేపింది. వెంకటగిరి పోలీసుల కథనం.. చిత్తూరు జిల్లా, చౌడేపల్లి మండలం, దుర్గసముద్రం గ్రామానికి చెందిన తోటి నిరంజన్ (27) బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఇంటి నుంచి వచ్చిన నిరంజన్ వెంకటగిరి రూరల్ మండలంలోని కోన మల్లేశ్వరస్వామి కోన వద్దకు చేరుకున్నాడు. తాను చనిపోతున్నాను.. అంటూ సెల్ఫీ వీడియో తీసి దాన్ని సోషల్ మిడియాలో అప్‌లోడ్ చేయగా.. దాన్ని కుటుంబ సభ్యులు కంగారుపడ్డారు. వెంటనే డయల్ 100కు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వెంకటగిరి సమీపంలోని కోనమల్లేశ్వరస్వామి కోనలో నిరంజన్ ఉన్నాడని తెలుసుకున్నారు. వెంటనే సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి రిస్క్యూటీమ్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం నిరంజన్ జాడ గుర్తించి వెంకటగిరి పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆపై కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిరంజన్ మానసిక స్థితి సరిగా లేకపోవడంతోనే ఆత్మహత్యాయత్నానికి యత్నించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయం

- తిరుపతి ఎంపీ గురుమూర్తి
- 12న పులికాట్ ముఖద్వార పనులపై సీఎం వర్చువల్ సమీక్ష
- నేడు తీరప్రాంతాల్లో ఎంపీ, ఎమ్మెల్సీ, కలెక్టర్ పర్యటన


మద్దిల గురుమూర్తి, ఎంపీ

తిరుపతి అర్బన్: మత్స్యకారుల అభ్యున్నతే లక్ష్యంగా పలు చర్యలు తీసుకుంటున్నట్లు తిరుపతి పార్లమెంట్ సభ్యుడు మద్దిల గురుమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ అందివచ్చిన అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ మత్స్యకారుల ఉన్నతికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నామన్నారు. తాను తిరుపతి ఎంపీగా ఎన్నికైనప్పటి నుంచి పులికాట్ ముఖద్వారం పూడిక తీయించడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వ శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ దశలవారీగా పూర్తి అనుమతులు పొందినట్లు వివరించారు. ఈనెల 12న పులికాట్ ముఖద్వారం పూడిక తీత పనులకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా సమీక్షించనున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో తీర ప్రాంత గ్రామమైన వాకాడు మండలం నవాబ్‌పేటలో శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ మేరిగ మురళి, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కూడా తనతో పాటు ఆ ప్రాంతంలో పర్యటించనున్నారని చెప్పారు. మధ్యాహ్నం 12.20 గంటలకు బురదగాలి కొత్తపాలెంలో పులికాట్ లేక్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ ఉంటుందని, తర్వాత అక్కడ నూతనంగా నిర్మించిన హాస్పిటల్ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు చిల్లకూరు మండలం వరగలి గ్రామంలో రూ.35 లక్షల ఎంపీ నిధులతో నిర్మించనున్న తాగు నీటి ట్యాంక్ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటామని వెల్లడించారు.